www.prajasakti.com
# ప్రజాశక్తి
శనివారం 9 నవంబర్ 2024

## విద్యార్థులకు హియరింగ్ పరికరాలు పంపిణీ
**ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె**

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో ప్రకాష్‌నగర్‌లో ఆశా నిలయం ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు ఆడియో మెట్రిక్ టెస్టులు హియరింగ్ మిషన్లను సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన నల్సా పథకాలు, స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015, నల్సా మానసిక అనారోగ్యం, మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవలు పథకం 2015, లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 గురించి వివరించారు. వైద్యాధికారులచే ఆడియో మెట్రిక్ టెస్టులు నిర్వహించారు. ఎనిమిది మంది ప్రత్యేక పిల్లలకు హియరింగ్ మిషన్లు అందజేశారు. అనంతరం మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ జడ్జిలు, ప్రత్యేక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలపై 'ప్రజాపోరు'

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై 'ప్రజాపోరు' నిర్వహించారు. పేదలు, సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలోపే ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపిందని. ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో కనీస వసతులు లేక పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేపట్టారు. వెంటనే పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం సంబంధితాధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

పోరుమామిళ్ల : నిరసన తెలియజేస్తున్న ప్రజలు, సిపిఎం నాయకులు

## కరువు ప్రాంతంగా ప్రకటించాలి
**ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కాశినాయన)**

పోరుమామిళ్ల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్. భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల చెరువుకు వెలిగోడు నుంచి నీరు వచ్చేందుకు ప్రభుత్వ కృషి చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరుమామిళ్లలోనే జిపి నగర్ వాసులకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ట్రూ అఫ్ ఛార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. వర్షాలు లేని కారణంగా బద్వేలు నియోజకవర్గంలోని ఏ చెరువులకు నీళ్లు లేవని, ఎన్డిఎ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి రాగానే , భారం మోపడం చాలా దారుణం అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బాల గోపాలయ్య, సుందరయ్య, వరలక్ష్మి శ్రీనివాసులు, చిన్నయ్య, బీబీ, ఓబులమ్మ, వెంకటలక్ష్మి, రత్నం, షరీఫ్, గురయ్య, రవి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

## విద్యుత్ ఛార్జీల భారం వద్దు
**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్ )**

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపవద్దని సిపిఎం పట్టణ కార్యదర్శి కె. సత్యనారాయణ పేర్కొన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వహయాంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ఛార్జీలు తగ్గిస్తామని నమ్మబలికిన చంద్రబాబు, మోడీ, పవన్ కళ్యాణ్ ప్రజలను వంచించారని, వైసిపి ప్రభుత్వ దారిలోనే కూటమి ప్రభుత్వం నడవడం శోచనీయమని పేర్కొన్నారు. ఒకవైపున నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు సతమతమవుతుండగా ఉపశమనం కలిగించాల్సిన ప్రభుత్వం వేల కోట్ల రూపాయల విద్యుత్ భారం వేయడం గర్హనీయమన్నారు. ఉచిత సిలిండర్ పేరుతో రూ 2500 కోట్ల రాయితీలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న నేతలు, మరోవైపు రూ.17 వేల కోట్ల భారం వేసి ప్రజల జేబులు ఖాళీ చేయడం మోసపూరితమన్నారు. 2023 -24 సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్ పై ప్రతి యూనిట్ కు 50 పైసల నుండి రూ.2 50 పైసల వరకు భారం పడనుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెల కాలంలో ప్రజలపై ట్రూ అప్ ఛార్జీలతో ప్రజలపై భారాలు వేయడం మంచి పద్ధతి కాదని అన్నారు గత ప్రభుత్వంలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన పాపానికి 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారని, ఇవేమిచనం కూటమి ప్రభుత్వం గుర్తించుకోవాలని పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపిపై ఒత్తిడి తీసుకువచ్చి పెట్రోలు, డీజిల్ జిఎస్టిలోకి చేర్చాలని కడప స్టీల్ ప్లాంట్ పై మాట్లాడాలని పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎం బాబు, సర్వేశ్వ, ముంతాజ్ బేగం, సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్, సాల్మన్, శేఖర్, భానుమతి, వెంకటసుబ్బమ్మ చెన్నారెడ్డి, ఐద్వా నాయకులు మహబూబ్ బాషా, డేవిడ్ పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలను బలపరచాలి : సిపిఎం
**ప్రజాశక్తి-అట్లూరు**

ప్రజా ఉద్యమాలను బలపరచాలని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు చేసే సిపిఎంను విరాళాలిచ్చి ఆదరించాలని మండల కన్వీనర్ ఇ. రమణ కోరారు. శుక్రవారం అట్లూరు మండల క్రాస్ రోడ్ లో వరికుంట కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు కోసం నిర్వహించే ప్రజా ఉద్యమాలను బలపరచాలన్నారు. రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, మహిళ, దళిత, బలహీన వర్గాల యువత, విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే సిపిఎం మండల శాఖ మహాసభలకు ఆర్థిక సాయం ద్వారా చేయూతనివ్వాలని కోరారు. ప్రజలు ఇచ్చే ప్రతి రూపాయి ప్రజా ఉద్యమానికి ఖర్చు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బి.స్వప్న, గురమ్మా, అదిలక్షుమ్మ, వై.తిరిపాలు రెడ్డి, పి.రవిచంద్ర, బి.గంగయ్య ప్రశాంత్ పాల్గొన్నారు.

## వలస కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలి : వ్య.కా.స
**ప్రజాశక్తి- గోపవరం**

మండలంలోని పిపి కుంట వద్ద నివాసం ఉంటున్న వలస కార్మికులకు ఇళ్ల పట్టాలు, మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బద్వేల్ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట వలస కార్మికులతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి. కోడూరు క్రాస్ రోడ్డు వద్ద కామకుంట రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 14 -1,2,3,4 లో ప్రభుత్వ భూమిలో ఎనిమిదేళ్లుగా వలస కార్మికులు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, వారందరికీ మౌలిక సదుపాయాలు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోపవరం మండల పరిధిలోని పిపి కుంట వద్ద ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 1620 16 21లో దాదాపు వంద మంది వలస కార్మికులు నివసిస్తున్నారు వారందరికీ మౌలిక సదుపాయాలు కల్పించాల్సినటువంటి రెవెన్యూ అధికారులు, బాధితులపై కేసు నమోదు చేయడం, గుడిసెలు తొలగించడం దారుణమని వాపోయారు. భారత రాజ్యాంగంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిలో నివాసం ఉన్న వారందరికీ ఇళ్ల స్థలాలు, మౌలిక సదుపాయాలు, ఓటు హక్కు కల్పించాల్సినటువంటి బాధ్యత ప్రభుత్వ రెవెన్యూ అధికారుల పైన ఉందని గుర్తు చేశారు. వలస కార్మికులు వల్ల బద్వేల్ పట్టణం పెద్ద ఎత్తున విస్తరించిందన్నారు. గ్రామాలలో నివసించడానికి భూమి, ఉపాధి లేకపోవటం వల్లే వలస కార్మికులు పట్టణాల వైపు వెళ్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే పిపికుంటలో వలస కార్మికులు నివసిస్తున్నారని చెప్పారు. వలస కార్మికులకు ప్రత్యేకమైన చట్టాలు ఉన్నాయి వాటిని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు అనంతరం ఎఒకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బి. కోడూరు మండల కార్యదర్శి ఓబయ్య, విజయ్, ప్రసాద్, ఈశ్వరయ్య, గోపవరం మండల కార్యదర్శి నరసింహులు, కుమారి, ఓబులేసు, జయరాజు పాల్గొన్నారు.

మైదుకూరు: తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళ చేస్తున్న కాలనీ వాసులు

## సుందరయ్య కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి
**ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)**

మైదుకూరు పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న సుందరయ్య కాలనీకి కనీస వసతులు కల్పించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ సుందరయ్య కాలనీలో పేదలు ఎనిమిదేళ్లుగా నివాసం ఉంటున్నారని, వారికి ఇంతవరకు పట్టాలు మంజూరు చేయాలని వాపోయారు. డోర్ నెంబర్లు కూడా కేటాయించాలన్నారు. సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వారి ఇళ్లకు కనెక్షన్లు ఇప్పించి తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్లు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్ అమరేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గురయ్య,రవి, పోలయ్య, లక్ష్మయ్య, సిఐటియు నాయకులు జహంగీర్‌బాష, సుధాకర్, థామస్, ఐద్వా నాయకులు గంగమ్మ, లక్ష్మీదేవి, పుల్లయ్య, బాలరాజు , ఇమామ్ పాల్గొన్నారు.

గోపవరం : ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వలసకార్మికులు

## పరిశోధనపై అవగాహన అవసరం : ప్రిన్సిపల్
**ప్రజాశక్తి - కడప**

ప్రొఫెసర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

విద్యార్థులు ఉన్నత చదువుతోపాటు పరిశోధనపై అవగాహన కలిగి ఉండాలి అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ రెడ్డి సూచించారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) కడప వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ స్టార్ స్టేటస్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి చే ఔషధ మొక్కల వైవిధ్యత, విజ్ఞానంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. తొలుత కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశోధన పట్ల అవగాహన, నైపుణ్యాలు పెంచడానికి ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల వైవిధ్యత, విజ్ఞానం అతిథి ఉపన్యాసం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులు అడిగిన అన్ని ప్రశ్నలకు ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి చక్కగా వివరణ తెలిపారు. కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం. వి. సురేష్ బాబు, తిలక్ విద్యాసాగర్, శివరామకృష్ణ, డాక్టర్ నీలయ్య పాల్గొన్నారు.

## సీనియర్ కమ్యూనిస్టు నాయకులు లింగమూర్తి మృతి
**ప్రజాశక్తి - కడప అర్బన్**

కమ్యూనిస్టు సీనియర్ నాయకులు లింగమూర్తి శుక్రవారం మృతి చెందారు. సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, రామమోహన్, కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పార్థివ దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా కడప జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉద్యమ నిర్మాణంలో కీలకంగా వహించారని పేర్కొన్నారు. ధనిక వర్గంలో పుట్టి అట్టడుగు పేదల కోసం తన జీవితాన్ని ధారపోశారని పేర్కొన్నారు.

లింగమూర్తి (ఫైల్‌ఫొటో), నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

# నిలకడ లేని 'ఉల్లి' ధరలు

- అమ్మకాలు పూర్తయిన తరువాత పెరిగిన ధరలు
- గత వారంలో క్వింటా రూ.1500, ప్రస్తుతం రూ.4,500
- పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- లభించని గిట్టుబాటు ధరలు
- మార్కెట్‌లో ధర ఉన్నా.. రైతుకు మాత్రం నష్టమే
- దిక్కుతోచని స్థితిలో రైతులు

**ప్రజాశక్తి - చాపాడు/పులివెందుల టౌన్**

ఉల్లి ధరలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పంట చేతికి రాకముందు ఉన్న ధరలు తీరా విక్రయించే సమయానికి పడిపోతున్నాయి. నిలకడ లేని ధరలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో సామాన్యులకు మాత్రం ఉల్లిపాయలు కన్నీటి తెప్పిస్తున్నాయి. సాగు చేసిన రైతులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దళారులు, వ్యాపారులు తమ ఇష్టాను సారంగా ధరలు నిర్ణయించి రైతులను నష్టాల బాట పట్టిస్తున్నారు. ఈ ఏడాది సాగు ఖర్చులు మాత్రం విపరీతంగా పెరిగాయి. లాభం అటు ఉంచితే కనీసం పెట్టుబడి కూడా చేతికి అందడం లేదని రైతులు వాపోతున్నారు.

**చాపాడు :** గత వారం వరకు రూ.1500 కూడా పలకని క్వింటా ధర ఏకంగా శుక్రవారం ఏకంగా రూ. 4,500 పలుకుతున్నాయి. అక్టోబర్ 15 నుంచి ఉల్లి నూర్పిడి రైతులు అధికంగా చేపట్టారు. ఆ సమయంలో ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం అమ్మకాలు పూర్తయిన తర్వాత ధరలు అమాంతం పెరిగాయి. దీంతో ఉల్లిపంట సాగు చేసి అమ్మకాలు చేపట్టిన రైతులు దిగాలు చెందుతున్నారు. ఎకరా పై రూ. లక్షలు నష్టాలు చవిచూశామని వాపోతున్నారు. అడపాదడపా వర్షాల కారణంగా సాగుచేసిన పంట దెబ్బతినడంతో ఒకటికి రెండుసార్లు సాగు ఖర్చులు రైతు మీద పడుతున్నాయి. ఈ ఏడాది ధరలు సెప్టెంబర్‌లో క్వింటా రూ.3500 వరకు పలికాయి. సెప్టెంబర్ చివరిలో క్వింటా రూ.2800కు పడిపోయాయి. నవంబర్ ప్రారంభంలో రూ. 1500 మాత్రమే పలికాయి. రెండు రోజులుగా ధరలు క్రమేపి పెరుగుతూ ప్రస్తుతం రూ. 4500 చేరుకున్నాయి. ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. జిల్లాలో దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, తదితర ప్రాంతాల్లో 5వేల ఎకరాల్లో సాగు చేశారు. రైతులు కర్ణాటక ప్రాంతంలోని చిక్బలాపూర్, గోర్ బెద్దనూర్, నంద్యాల నుంచి విత్తనాలను సేకరించి సాగు చేపట్టారు. దళారులు రోజుకో రేటును నిర్ణయిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మైదుకూరు ప్రాంతంలో శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సాగు మరింత పెరిగి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండే అవకాశం ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్లుగా రైతులు ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో మాత్రం ఉల్లి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కానీ రైతులకు మాత్రం నష్టాలే మిగిల్చుతున్నాయి.

### నిలకడ లేని ధరలతో నష్టం..

పది రోజుల కిందట రెండు ఎకరాలలోనే ఉల్లి దిగుబడిని అమ్మకాలు చేపట్టారు. ధరలు కేవలం క్వింటా రూ.1800 మాత్రమే పలికాయి. ప్రస్తుతం క్వింటా రూ.4500 గా ఉంది. రెండు ఎకరాలపై దాదాపుగా రెండు లక్షలకు పైగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధరలు నిలకడగా ఉంటే ఇలాంటి పరిస్థితి ఏర్పడేది కాదు.

**- రామ సుబ్బారెడ్డి, ఉల్లి రైతు దువ్వూరు.**

### రూ.2 లక్షలు నష్టం

మూడు ఎకరాలు కౌలుకు భూమి తీసుకుని ఉల్లి పంటను సాగు చేపట్టాను. క్వింటా రూ. 3వేలతో అమ్మకాలు చేపట్టిన తర్వాత ఒక్క రోజులోనే రూ.1500 ధర పెరిగింది. దీంతో మూడు ఎకరాలపై రూ. రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. వ్యాపారులు మాత్రం 2 లక్షలు ఆదాయం పొందారు. . ప్రభుత్వం ఇప్పటికైనా నిలకడ ధరలను ఏర్పాటు చేయాలి.

**- ప్రసాద్, ఉల్లి రైతు, చాపాడు.**

**పులివెందుల టౌన్ :** గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలు మూట కట్టుకోవాల్సి వస్తుంది. వర్షాభావ పరిస్థిలతులకు ఎదరొడ్డి నిలిచిన రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ ఏడాది ఉల్లి పం ట విస్తారంగా సాగు చేశారు. ఎకరానికి సగటున 70-80 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. పంట కోత సమయానికొచ్చే సరికి మార్కెట్లో ధరలు క్రమేనా తగ్గుముఖం పట్టాయి. ముందుగా కోతల కోసిన కొందరు రైతులు కొంతమేర లాభాలు తీసుకున్నారు. మిగతా 85 శాతం మంది రైతులు ఉల్లి అమ్ముకో వాల్సి ఉంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో ఉల్లి రైతులు అయోమయానికి గురవుతున్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కూటమి సర్కార్ తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవసరం ఉంది. వర్షాభావ పరిస్థితులు, గిట్టుబాటు ధరలు లేనందున రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఉల్లి రైతుల కష్టాలు వర్ణ నాతీతం అని ధరలు అనుకూలించక విలవిలలాడిపోతున్నామని ప్రభుత్వం అన్నివిధాలుగా రైతులకు అండగా ఉండాలని రైతులకు కోరుకుంటున్నారు.

### భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు

ఈ ఏడాది సాగు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. గతంలో 28.28.28 ఎరువు బస్తా రూ.1,800 ఉండగా ప్రస్తుతం బస్తా రూ.2,200 వరకు చేరుకుంది. అలాగే ఒక బస్తా డిఎపి రూ.1,200 ఉండగా, ప్రస్తుతం రూ.1,700 వరకు పెరిగింది. ఇలా ప్రతి బస్తామీద రూ.400 చొప్పున అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎకరా ఉల్లి పంట సాగుకు 12-15 బస్తాల రసాయన ఎరువులు, క్రిమిసంహారక (నీళ్ల మందులు) మందులు ఒక సారి కి రూ.2500 చొప్పున కొనుగోలు చేసి 10 సార్లకు రూ.25 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతన్నారు. ఎరువులు ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

### రైతుల సమస్యలపై దృష్టి సారించాలి

మూడు ఎకరాలలో ఉల్లి సాగు చేశా. పంట కోతకు వచ్చే సరికి మార్కెట్‌లో ధరలు తగ్గిపోవడంతో నష్టపోతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలేదు. ప్రధానంగా ఉల్లి పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలి. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని గిట్టుబాటు ధరలు కల్పిస్తే బాగుంటుంది.

**- రామాంజనేయులు, ఉల్లి రైతు, పెర్నపాడు, పులివెందుల.**

### గిట్టుబాటు ధర కల్పించాలి

ధరలు బాగుంటాయని రెండు ఎకరాలలో ఉల్లి పంటను సాగుచేశాను. ఎకరానికి సుమారు 60-70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులు భారీగా అయ్యాయి. చివరకు మార్కెట్లో ధరలులేక పెట్టుబడి ఖర్చు వస్తుందో? లేదోనని భయంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కల్పించుకొని గిట్టుబాటు ధరకల్పించాలి.

**-రామసురారెడ్డి, ఉల్లి రైతు, పెద్దజూటూరు, పులివెందుల.**

## వ్యవసాయానికి సాగునీరు అందించాలి : కలెక్టర్
**ప్రజాశక్తి - కడప**

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వ్యవసాయానికి సాగునీరు అందించి రైతులు పంటలు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డ్ రూమ్ హాలులో జిల్లాలో నీటి లభ్యత, సాగునీటి పంపిణీ, తాగునీటి సరఫరాపై నీటిపారుదలశాఖ, వ్యవసాయ శాఖ, ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందించే సాగునీటి నిర్వహణ వ్యవస్థను పటిష్టంగా అమలు చేసి రైతులకు మేలు జరిగేలా అన్ని పంటలకు నీరు అందేలా చూడాలన్నారు .జిల్లాలోని భారీ, మధ్య, చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టులలో ఎన్ని టిఎంసిల మేరకు నీటి నిలువ ఉన్నాయని, వాటి కింద ఎంత ఆయకట్టు ఉందని సంబంధిత ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వ్యవసాయ పరిస్థితులు ఖరీఫ్,రబీ సీజన్లో ఏ పంటలు సాగు చేస్తున్నారు. వాటి ఉత్పత్తి, మార్కెటింగ్, స్టాక్ వంటి అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డిఒలు వ్యవసాయ, నీటిపారుదల శాఖలతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించుకుంటూ వారానికి ఒక సమావేశం నిర్వహించుకోవాలని సూచించారు. జిల్లాలోని తాగునీటి వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు సమావేశంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు,ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, సాయి శ్రీ, ఇరిగేషన్ ఇంజనీర్లు, వ్యవసాయ అధికారులు, గ్రౌండ్ వాటర్ అధికారులు,ఆయా మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

## ఉద్యోగోన్నతుల షెడ్యూలు అమలు చేయాలి
**ప్రజాశక్తి- కడప అర్బన్**

డిఇఒకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల షెడ్యూల్ ఏ ఆటంకం లేకుండా జరుగుతోందని, కడప జిల్లాలో మాత్రం షెడ్యూల్ అమలు వాయిదా పడుతోందని, ముందుగా ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించి తుది సీనియారిటీ జాబితా విడుదల చేయాలని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం బాలగంగారెడ్డి, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్ రెడ్డి కోరారు. శుక్రవారం డిఇఒ మీనాక్షికి ఆమె ఛాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ శనివారం నాటికి ఫైనల్ సీనియారిటీ లిస్టు విడుదల చేసి, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌తో పాటు ఉద్యోగోన్నతులు చేపడుతామని హామీ ఇచ్చారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

## 14న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా
### - సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్
**ప్రజాశక్తి - కడప అర్బన్**

సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 14న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలిపారు. మహా ధర్నా జయప్రదం కోసం శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలపై దాదాపు రూ.18 వేల కోట్లు తీవ్రమైన భారం కూటమి ప్రభుత్వం మోపిందని పేర్కొన్నారు. జిల్లాలో తీవ్రమైన కరువు నెలకొందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాలలో కడప జిల్లాలో ఒక్క మండలం కూడా లేకపోవడం అన్యాయమని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ఈ నేపథ్యంలో ప్రజలపై విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో భారాలు మోపడం చాలా దుర్మార్గకరమని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క చెబుతున్నా ఆచరణలో సాధ్యం కాలేదని చెప్పారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ శంకుస్థాపనలకే పరిమితం అయిందని ఆయన తెలిపారు. విభజన హామీల కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వంపై తెలుగుదేశం ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మహా ధర్నా లో జిల్లా ప్రజానీకం, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ మోహన్, బి.మనోహర్, ఐ.ఎన్. సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## రేపు సిపి బ్రౌన్ 226వ జయంత్యుత్సవం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 226వ జయంత్యుత్సవం, మధ్యాహ్నం 3 గంటలకు అష్టావధానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా వైవీయూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, గౌరవ అతిథిగా విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పి.సంజీవమ్మ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడి నాగేశ్వరరావు

## సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి

**ప్రజాశక్తి -పులివెందుల రూరల్**

వ్యవసాయ శాఖ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో పులివెందుల వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రం సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రబీ పంటలకు సంబంధించి వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 8 పంటలను ప్రధానమంత్రి పసల బీమా యోజన పథకం అమలుకు గుర్తించారని చెప్పారు. ఇందులో ప్రధానంగా వేరుశనగ, శనగ, నువ్వులు ,పెసలు, ఉద్దులు, జొన్న, పొద్దుతిరుగుడు పంటలకు సంబంధించి పంటల బీమా ప్రీమియం డిసెంబర్ 15 లోపల చెల్లించాలన్నారు. ప్రతి రైతు సేవ కేంద్రం సహాయకులు మీ పరిధిలో ఉన్న రైతులకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలాగా కృషి చేయాలన్నారు. వారికి అవసరమైన సమాచారాన్ని సలహాలను ఇవ్వాలన్నారు. ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు మీ పరిధిలోని రైతులు పండించే పంటలలో చీడపీడలు , వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, అధిక దిగుబడులు కోసం పంటల యాజమాన్య పద్ధతులు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రమణారెడ్డి, పులివెందుల వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి, పులివెందుల డివిజన్‌లోని మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## 10లోపు రీసర్వే పూర్తి చేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప :** ఈనెల 10లోపు ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ఆర్‌డిఓ, ఆర్‌డిఓలు, సంబంధితాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్రీ హోల్డ్ భూముల ధృవీకరణకు సంబంధించి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అప్పీల్స్, డిజిటల్, ఇనాం, షరతుగల పట్టా మొదలైన కేటగిరీలకు చెందిన భూములను పరిశీలన పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మండలాలపై సంబంధిత ఆర్‌డిఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన మాజీ డిప్యూటీ సిఎం

**ప్రజాశక్తి - కడప :** ఇటీవల వైఎస్ఆర్ కడప జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను శుక్రవారం ఆయన ఛాంబర్‌లో మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా, కడప నగర మేయర్ కే. సురేష్ బాబు, వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. కడప జిల్లా, నగర అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. **కడప అర్బన్:** టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ మొక్కను అందజేశారు. అనంతరం జిల్లా పరిస్థితులపై కలెక్టర్ వివరించారు.

## ఎస్‌బి డిఎస్‌పిగా వాసుదేవన్

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** కడప ఎస్‌బి డిఎస్‌పి వాసుదేవన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన సత్యసాయి జిల్లా పుట్టపర్తి డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. అక్కడ నుంచి బదిలీపై కడప ఎస్‌బి డిఎస్‌పిగా రానున్నారు. . గతంలో కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు.

## డ్రాగా ముగిసిన గుంటూరు, అనంతపురం జట్ల మ్యాచ్

**ప్రజాశక్తి - కడప :** వైఎస్ఆర్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో గుంటూరు అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 256 పరుగులు చేసింది. వివర రోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 65.4 ఓవర్లలో 179 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఫుల్‌కీకర్ 61 పరుగులు చేశారు. గుంటూరు జట్టులోని షాన్ 5, భాదరబల్లి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 30.0 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. ఆ జట్టులోని కౌశిక్ 63 పరుగులు చేశారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో అధికత సాధించింది.

## మహిళలకు అవకాశాలు కల్పిస్తే దేశానికి కీర్తి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని విశ్వ చూపుతుందని సమాన అవకాశాలు కల్పిస్తే సమాజానికి దేశానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకు వస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం 'మహిళలపై హింసపై సామాజిక చట్టపరమైన అవగాహన' అనే అంశంపై సదస్సు వైవియు హ్యుమానిటీస్ భవనంలోని మొల్ల సమావేశ మందిరంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ ఆచార్య ఎం.ఎం.వినోదిని అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసి మాట్లాడుతూ లింగ వివక్షను నిర్మూలించే దిశగా వైవియూ విద్యార్థులు ప్రయత్నం చేయాలని ఆకాంక్షించారు.

# క్రైం కార్నర్

## 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### - స్మగ్లర్ అరెస్టు, 8 మంది కూలీలు పరార్

**ప్రజాశక్తి సిద్ధవటం**

సిద్ధవటం బీట్‌లోని, బద్రి కోన అటవీ ప్రాంతంలో 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నామని, స్మగ్లర్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నామని సిద్ధవటం అటవీ క్షేత్ర అధికారి కళావతి తెలియజేశారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తమకు అందిన సమాచారం మేరకు కడప డిఎఫ్ఒ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు తమ సిబ్బందితో గురువారం రాత్రి సిద్ధవటం బీట్‌లోని బద్రి కోన అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించామని చెప్పారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసేందుకు కారులో లోడ్ చేస్తుండడం గమనించామని తెలిపారు. తమ సిబ్బందిని చూసి పరార్ వారు పరార్ అయ్యారని, వారిని వెంబడించి దాడులు చేసి స్మగ్లర్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ లభ్యమైన 12 ఎర్రచందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టుబడిన స్మగ్లరును విచారించగా అతనిది నెల్లూరు జిల్లా కలువాయి మండలం తెలుగు రాయపురం గ్రామమన్నారు. బెంగళూరుకు చెందిన హయాత్ అనే వ్యక్తి కారులోపాటు8 మంది కూలీలను అప్పజెప్పి ఎర్రచందనం దుంగలు తీసుకురావాలని చెప్పారని విచారణలో నిందితుడు తెలిపారన్నారు. పరార్ అయిన 8 మంది కూలీల కోసం అటవీ సిబ్బంది విస్తృత గాలింపు చర్యలు చేపట్టామని అన్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగల బరువు 274 కిలోలు ఉండగా, వీటి విలువ రూ,76,120 చేస్తాయని అన్నారు . ఈ మేరకు కేసు నమోదు చేసి వెంకటేష్‌ను తిరుపతి కోర్టుకు హాజరు పరుస్తున్నామని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఎఫ్‌బీఓ పెంచల రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ఎబిఓ హైమావతి, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

**ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం**

మండలంలోని మల్లెగుడిపాడు సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన తన పోలీస్ సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న స్థావరం పై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ. 5210లను నగదు స్వాధీనం చేసుకున్నారు.

### గ్రంథాలయ ఉద్యోగుల

# సమస్యల పరిష్కారానికి సహకరిస్తాం

### - జెఎసి జిల్లా చైర్మన్ బి.శ్రీనివాసులు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని జెఎసి జిల్లా చైర్మన్ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో యుటిఎఫ్ భవన్‌లో రాయలసీమ ప్రాంతీయ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా జెఎసి అధ్యక్షులు బి. శ్రీనివాసులు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన, కార్యదర్శి పాలెం మహేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బి. శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగుల న్యాయ సమస్య అయిన 010పద్దు ద్వారా జీతాలు చెల్లించేటట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ ఉద్యోగులకు ఎపి జెఎసి పూర్తి సహకారం అందజేస్తుందని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ గ్రంథాలయాలు పాఠకులకు అనుకూలమైన సమయాల్లో పనిచేయవలసిన అవసరం ఉందని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్వహణ సమయాల్లో కూడా మార్పులు తీసుకురావాలని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గ్రంథాలయాలు పౌర విజ్ఞాన కేంద్రాలుగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నిరుద్యోగులకు నిరంతరం అందుబాటులో ఉండాలంటే ఖాళీగా వున్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగుల నియామకాలు, ఉద్యోగోన్నతులు లేక అరాకొర సిబ్బందితో గ్రంథాలయాలు నిర్వహించడం చాలా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. అనంతరం పలు అంశాలపై చర్చించి, తీర్మానాలు చేసి ఆమోదించారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి అలీ, పి.కమ్మన్న, శ్రీనివాసులు , జయరాం, నాగమణి, కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు,నెల్లూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎసి జిల్లా చైర్మన్ బి. శ్రీనివాసులు

## అన్ని శాఖల్లోనూ అవినీతి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్ ) :** వైసిపి పాలనలో ప్రొద్దుటూరులోని అన్ని శాఖల్లోనూ అవినీతి చోటు చేసుకుందని, అన్నింటినీ వెలికి తీస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెహ్రూరోడ్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చి 5 నెలలు కావస్తోందని, ఈ సమయంలో రాష్ట్రంలో జగన్ విపరీతమైన దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఐదునెలల కాలంలో అత్యాచారాలు, అభివృద్ధి పనులపై ప్రజలలో అపోహలు సృష్టిస్తు న్నారన్నారు. సామాజిక మాధ్యమాలలోనూ దుష్ప్రచారం చేయిస్తున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరులో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని వివరించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అనేది లేనే లేదని, అందుకే 11 సీట్లకు పరిమితం అయ్యారని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా మారి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని, రానున్న తరాలకు మంచి పాలన, భవిష్యత్తు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, వివిఎస్ ముక్తియార్, కౌన్సిలర్‌కమాల్, ఘంటసాల వెంకటేశ్వర్లు, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## గతం మరిచిపోయారా?

**ప్రజాశక్తి -కమలాపురం టౌన్ :** గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలపై వైసిపి పెట్టిన కేసులు, చేయించిన దాడులు మరిచిపోయారా జగన్మోహన్ రెడ్డి అంటూ జిల్లా టిడిపి ముస్లిం మైనారిటీ అధ్యక్షులు ఖాదర్‌బాషా ప్రశ్నించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులు, సోషల్ మీడియాలో చేసిన పోస్టులు అన్యాయమని ప్రశ్నించిన వారిని పోలీసులతో అరెస్టు చేయించలేదని పేర్కొన్నారు. మీకు నచ్చినట్లుగా పోలీసు వ్యవస్థని మార్చుకుని టిడిపి నాయకులు, కార్యకర్తలను నానా రకాలుగా చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. అధికారం పోయినా అసత్య ప్రచారాలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. సమావేశంలో లోమడ వాసుదేవరెడ్డి, మల్లేశ్వరుడు, శేషారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, రామిరెడ్డి రమణా రెడ్డి పాల్గొన్నారు.

## చలో విజయవాడ కరపత్రాల ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు( పుట్టపర్తి సర్కిల్ )**

ఎస్‌సి వర్గీకరణ కోసం ఉరుసు పాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 16న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిఆపిఎస్ జిల్లా మహిళా అధ్యక్షులు చెన్నమ్మ మాదిగ, జిల్లా అధ్యక్షులు గడ్డం నరసింహులు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎర్రన్న కొట్టాలలోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఎస్‌సి వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తూ తమ కోరికలు తీర్చమని అనేక ప్రభుత్వాలను కోరినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. అందుఏకే ఉరుసు పాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎరుకలయ్య, రంగనాయకులు, బెనర్జీ, నారాయణ ,రామంజి, రమేష్, విద్యార్థి నాయకులు జగన్, శ్రీకాంత్, ఓబులేసు పాల్గొన్నారు.

## 'ఉల్లాస్'పై అవగాహన

**ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు) :** మైదుకూరు కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు అధ్యక్షతన శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా డిడి వెంకట సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల పైబడిన ఎస్‌హెచ్‌జి సభ్యులకు విద్యను అందించే కార్యక్రమమే ఉల్లాస్ అన్నారు. 10 మంది ఒక బ్యాచ్‌గా నిర్ణయించి వారికి ఆర్థిక అక్షరాస్యత, న్యాయ అక్షరాస్యత, సంఖ్యలు, డిజిటల్ అక్షరాస్యతను 6నెలలు బోధిస్తామని, దీని కోసం అంగన్ వాడి కేంద్రాలు ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మయ్య, ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీదేవి, ఎంఇఒ నరహరి శర్మ, ఎపిఎం జయరాజు, ఎఒ నాగేంద్రబాబు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## పురుగుల మందు నమూనాలు సేకరణ

**ప్రజాశక్తి - ముద్దనూరు :** పురుగుల మందు దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నమునాలు సేకరించి పరిశీలన నిమిత్తం ప్రయోగశాలకు పంపనున్నట్లు వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని పురుగుమందుల దుకాణాలను శుక్రవారం ఎఒ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల యజమానులు వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి కలిగిన ఉత్పత్తులు మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. అమ్మిన ఉత్పత్తులకు నగదు బిల్లు ఇవ్వాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఉత్పత్తులకు సంబంధించి నగదు బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. పురుగు మందులు నియంత్రణ చట్టం ప్రకారం వ్యాపార లావాదేవీలు కొనసాగించాలని డీలర్లను హెచ్చరించారు. ప్రతి డీలర్ స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు సక్రమంగా రాసి ఉంచుకోవాలని ఆదేశించారు. స్టాక్ బోర్డు, ధరల పట్టిక రాసి పెట్టుకోవాలన్నారు. లైసెన్స్ వివరాలు కనపడేలా దుకాణంలో ప్రదర్శించాలని సూచించారు.

## మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం :** రైతులు మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చు అని వనిపెంట కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఎం. బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంకాలమ్మ గూడూరు, కసనూరు గ్రామాలలో సాగులో ఉన్న చీని, వేరుశనగ, పప్పు సెనగ పంటలను పరిశీలి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక పంటలైన చీనిలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడే మంచి దిగు బడులతోపాటు కాయలు నాణ్యత కూడా వస్తాయని చెప్పారు. ముఖ్యంగా వేరు కుళ్లు తెగులు, మంగు, పులుసు పురుగు తెగులు నివారణకు పిచికారి చేయాల్సిన మందులను రైతులకు వివరించారు. శనగ పంటలో పచ్చ పురుగు నివారిస్తేనే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్ రెడ్డి, మాజీ హార్టికల్చర్ బోర్డు మెంబర్ శివ ప్రసాద్ రెడ్డి, శాస్త్రవేత్తలు ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి వీరారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను నివారించాలి

**ప్రజాశక్తి - వేంపల్లె :** బాల్య వివాహాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని లీగల్ అధికారి రాజు, సిడిపిఒ సునీత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉర్దూ గురుకుల పాఠశాలలో మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ ఆదేశాలు మేరకు బాలల పరిరక్షణ, కిశోర వికాసంపై విద్యార్థులకు న్యాయ సలహాలు, బాల్య వివాహలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే విద్యార్థులు ఐసిడిఎస్ అధికారులకు కానీ, 1098 కానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

## చదువుతోనే సమాజంలో గుర్తింపు

**ప్రజాశక్తి - చాపాడు :** చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఎంపిడిఒ వీర కిశోర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల సభా భవనంలో వయోజన విద్యాశాఖ ద్వారా నిరంతర విద్యా కార్యక్రమం ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని ఐకెపి యానిమేటర్లు, మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా డిడి వెంకట సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చదువుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వెలుగు యానిమేటర్లు నిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలతో కలుస్తూ ఉంటారని చదువు ప్రాధాన్యతను గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరు చదువుకొని అక్షర జ్ఞానం కలిగే విధంగాచూడాలన్నారు.ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో గ్రామీణ ప్రాంత ప్రజలకు అక్షరజ్ఞానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కో- ఆర్డినేటర్ లక్ష్మయ్య ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ, వెలుగు ఎపిఎం శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

**ప్రజాశక్తి-కాశినాయన :** కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతామయని గొంటువారిపల్లె టిడిపి కొండా రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గొంటు వారిపల్లి జెఇ బాల పుల్లయ్య సమక్షంలో రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పనులు చాలా చక్కగా నాణ్యతగా చేస్తున్నారని, గొంతు వారి పల్లెలో ప్రజల కోరిక మేరకు సిసి రోడ్డు పనులు చేస్తున్నామన్నారు.

## కుర్చీ కాదు.. అభివృద్ధే ముఖ్యం : వైసిపి

**ప్రజాశక్తి - కడప :** ఎమ్మెల్యేగా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ఎక్కడ కూర్చోవాలనేది ముఖ్యం కాదు, ఎమ్మెల్యేగా కడప నగర అభివృద్ధికి ఎన్ని నిధులు తెప్పించారు చెప్పాలని వైసిపి మహిళా కార్పొరేటర్లు, కో - ఆప్షన్ సభ్యులు, మహిళా నాయకులు ప్రశ్నించారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌ను, వైసిపి కార్పొరేటర్లను అవమానిస్తూ మాట్లాడడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే మాధవికి ఈ సందర్భంగా వారు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కడప వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే తన ప్రవర్తనను మార్చుకోకుండా ఇలాగే వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చ రించారు. ముందు నగర సమస్యలపై, ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటిపై మాట్లాడితే అందరూ స్వాగతిస్తారని తెలిపారు. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి మంది మార్బలంతో ర్యాలీగా వచ్చి అధికార పెత్తనం చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. గత సమావేశంలో పార్టీలకు అతీతంగా సత్క రించి, గౌరవించామన్నారు. కార్పొరేటర్ అనే విలువ కూడా ఇవ్వ కుండా కార్పోరేటర్‌ను అవమానించారని, అది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి మహిళా కార్పొరేటర్లు శ్రీలేఖ, శ్రీలత, మల్లేశ్వరి, మాధవి, కో- ఆప్షన్ సభ్యులు పత్తి రాజేశ్వరి, తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** టిడిపి సభ్యత్వ నమోదు ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం 1,2వ డివిజన్లకు సంబంధించి టిడిపి సభ్యత్వ నమోదు శివాలయం సమీపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తి స్తుందని పేర్కొన్నారు. టిడిపి బలోపేతానికి నాయకులు కార్యకర్తలు కృషి చే యాలని చెప్పారు. కార్యక్రమంలో టి.కృష్ణారెడ్డి ఎద్దుల శంకర్, ఇ. చైతన్య, రాజా, నాగేశ్వరరావు, మురికినాటి శ్రీధర్, బాబు, ఆకుల రాజమో హన్, పుల్లయ్య, కృష్ణ, అడవాల రాజా, రమేష్, కృష్ణయ్య, స్థానికులు పాల్గొన్నారు.

## నారాయణ కళాశాల విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** కడప నారాయణ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని షేక్. అల్-అమీనా రాష్ట్ర స్థాయి అండర్ - 19 స్విమ్మింగ్, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో రజతం సాధించారు. శుక్రవారం విద్యార్థినిని కళాశాల డిజిఎం, డీన్, ఎజిఎం, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

## శ్రీ విగ్నేష్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** నగర శివారులోని శేషయ్య గారి పల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విగ్నేష్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే మాధవి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందిస్తే వ్యాపారం బాగా వృద్ధి చెందుతుందని తెలిపారు. యువత ఉపాధి వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. రెస్టారెంట్ యజమాని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తమ వద్ద అన్ని రకాల వెజ్, నాన్ వెజ్ భోజనం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. వివాహాది శుభకార్యాలకు క్యాటరింగ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే తనయుడు శ్రవణ్ రాజ్ రెడ్డి, టిడిపి నాయకులు బిడ్డ శ్రీధర్, శ్రేయోభిలాషులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## కేన్సర్ పరీక్ష చేయాలి

**ప్రజాశక్తి-కాశినాయన :** గ్రామాలలో ప్రతి ఇల్లూ తిరిగి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని నరసాపురం ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పుష్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నరసాపురంలోని ఆరోగ్య కేంద్రంలో కేన్సర్ వ్యాధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నిబంధన ప్రకారం ప్రతి కుటుంబాన్ని సందర్శించి అనుమానితులకు పరీక్ష చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గురుమూర్తి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా తనను జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నియమించారని గురు మూర్తి యాదవ్ తెలిపారు. శుక్రవారం ఉభయ రాష్ట్రాల జాతీయ బిసి సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం హైదరాబాదులోని రవీంద్ర భారతి ప్రెస్ క్లబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తనను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. బిసిల పట్ల అనుచితమైనటువంటి వ్యాఖ్యలు, కుల దూషణ లాంటివి ఏమైనా జరిగితే ఎస్‌సి, ఎస్‌టిలకు ఉన్నట్లుగానే అట్రాసిటీ చట్టాన్ని తేవాలని సమావేశంలో చర్చించారని పేర్కొన్నారు. ఈనెల 24న జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు పదివేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని తీర్మాణించారన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న గురుమూర్తి యాదవ్

## రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్ :** నియోజకవర్గంలోని వేంపల్లి మేజర్ పంచాయతీలో రోడ్ల పనులను తదితర పూర్తి చేయాలని, విస్తరణలో భాగంగా డ్రెయినేజీ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని రోడ్డు భవనాల శాఖ ఇఇ మాధవితో మాట్లాడారు. రోడ్ల పనులు అసంపూర్తిగా ఉన్నందు వల్ల దుమ్ము ఆహార పదార్థాలపై పడి శ్వాస కోశ, చర్మ, ఇతర వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కడప - వేంపల్లి - పులివెందుల రోడ్డులో వేంపల్లి పంచాయితీ పరిధిలో 3.8 కిలోమీటర్ల పొడవుతో రూ. 47.08 కోట్లతో 2023 జూన్‌లో రోడ్ల విస్తరణ, డ్రెయినేజీ పనులు మంజూరయ్యాయని , రూ. 8.49 కోట్ల మేర పనులు జరిగాయని పేర్కొన్నారు. వీటికి బిల్లులు రానీ కారణంగా సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారని పేర్కొన్నారు. ఇటీవలనే బిల్లులు కూడా వచ్చినా ఆగిపోయిన పనులు పునః ప్రారంభం కాలేదన్నారు. వేంపల్లి - రాయచోటి మార్గంలో రూ.1.35 కోట్లతో పనులు మంజూరయ్యాయని, రూ. 27 లక్షల మేరకు పనులు చేశారని, బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారని, వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## మహిళలపై గౌరవం లేదు

**ప్రజాశక్తి - చాపాడు :** వైసిపి నాయకులకు మహిళలపై ఏ మాత్రం గౌరవం లేదని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో మహిళలు అని చూడకుండా నీచమైన ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ పోస్ట్ చేసే వారిని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రక్షించేందుకు ప్రయత్నాలు చేయడం చూస్తుంటే వైసిపి విధానం ఏమిటో అర్థమవుతుందన్నారు. పోలీసులపై జగన్ మోహన్‌రెడ్డి తీరు సరిగా లేదన్నారు. ఇకనైనా మహిళలపై కాస్త గౌరవంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

## పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయాలి

**ప్రజాశక్తి - వేంపల్లె :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ నిధులతోపాటు ఎంఆర్‌సి సిబ్బంది వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అపార్ నమోదు ప్రక్రియలో కడప జిల్లా 6వ స్థానంలో ఉన్నప్పటికీ సరైన లక్ష్యాన్ని చేరుకోలేదని జిల్లాలోని ఎంఆర్‌సిలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, సిఆర్‌పిలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు పెండింగ్‌లో ఉంచడం శోచనీయం అన్నారు. ఎంతో ఒత్తిడితో నిర్విరామంగా జిల్లాలోని ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని పని చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కడప జిల్లా 6వ స్థానంలో ఉందని చెప్పారు. చిరు ఉద్యోగుల జీతాలను నిలపడం అన్యాయం అన్నారు. తక్షణం జీతాలను మంజూరు చేయాలని కోరారు.

## రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ముద్దనూరు :** మండల కేంద్రంలోని సుచరిత నర్సింగ్ హోంలో ఆదివారం ప్రొద్దుటూరుకు చెందిన హారిక ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ముద్దనూరు బాలనారాయణరెడ్డి ఆసుపత్రి ( వైద్యులు డాక్టర్ నవజ్యోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్ల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ యం.రమేష్ పరీక్షలు చేయనున్నారని పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ యం.నాగయ్య థైరాయిడ్, ఆయాసం, పక్షవాతం, గుండె జబ్బులు, ఊపిరి తిత్తులు, బిపి, షుగర్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - కడప :** కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా శనివారం కడప నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఉంటాయని కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి సేవ్య నాయక్ తెలిపారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతిబార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్‌టిసి బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులకు కలిగే ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. **సింహాద్రిపురం :** మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను మరమ్మతుల కారణంగా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ దినేష్ కుమార్ ఒక ప్రటకనలో తెలిపారు. మండలంలోని 33 కెవి సింహాద్రిపురం, జగంరెడ్డిపల్లి లైన్లు మరమ్మతుల కోసం శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. **వేముల :** మండల కేంద్రంలోని 33 /11 కెవి వేముల సబ్ స్టేషన్‌లో ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నామని విద్యుత్ జెఇ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, రైతులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలన్నారు. **ముద్దనూరు :** మండలంలోని విద్యుత్ ఉప కేంద్రాల మరమ్మతులు కారణంగా శనివారం మండల వ్యాప్తంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాసరాజ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు .ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1వరకు విద్యుత్తులో అంతరాయం ఉంటుందన్నారు. వినియో గదారులు గమనించి సహకరించాలని ఎఇ కోరారు. **ఖాజీపేట:** విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ఇంజనీర్ టి. నాగరాజు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చైతన్య పాఠశాలలో కలర్స్‌డే వేడుకలు

**ప్రజాశక్తి - వేంపల్లె :** స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం కలర్స్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు రంగు రంగుల దుస్తులు ధరించారు. దీంతో పాఠశాల ఆవరణం కళకళలాడింది. రంగుల విశేషాలను పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయాని చెప్పారు. ఆయా రంగులతో ఉన్న పండ్లు గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం రంగు రంగుల దుస్తులు వేసుకొని వచ్చిన చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి పలువురిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు, రేపు జాతీయ ఉర్దూ సెమినార్

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** కడప నగరంలోని ఎస్‌కెఆర్ మహిళ డిగ్రీ కళాశాలలో ఈనెల 9, 10 తేదీలలో జాతీయ ఉర్దూ సెమినార్ నిర్వహించనున్నట్లు జాతీయ సెమినార్ చైర్మన్ సత్తార్ ఫైజి, అంజుమన్ తరఖి ఉర్దూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అబ్దుస్ సత్తార్ సాహిర్, సయ్యద్ హిదాయతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ జాతీయ సెమినార్ లో భాగంగా 9న ఉదయం ప్రజా ప్రతినిధులతో ప్రారంభ సభ, మధ్యాహ్నం ఉర్దూ భాషాభివృద్ధిలో ప్రభుత్వం పాత్ర, సాయంత్రం సెషన్ లో ఉర్దూ భాషాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర, రాత్రి జాతీయ కవి సమ్మేళనం, 10న ఉర్దూ భాషాభివృద్ధిలో ఉర్దూ సంఘాల పాత్ర, సావనీర్, వివిధ రచయితల పుస్తకాల ఆవిష్కరణ, పరిశోధన పత్రాల సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

## హుండీ ఆదాయం రూ.10.19 లక్షలు

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్య క్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆరు నెలలకు సంబంధించిన లెక్కింపు చేపట్టగా రూ.10.19 లక్షలు ఆదా యం వచ్చిందని ఇఒ మారుతి ప్రసాద్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేశామని తెలిపారు.

**రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు**

**H.M.O.P.No. 132/2022**

నారుపల్లి రామభూపాల్‌రెడ్డి, S/o వెంకట నారపురెడ్డి, వయస్సు 28 సం॥లు, వ్యవసాయం వలన జీవనం, R/o. D.No. 1/223, 1వ వార్డు, మదిరేపల్లి గ్రామం, దువ్వూరు మండలం, కడప జిల్లా. ...పిటీషనరు

Vs

నారుపల్లి వెంకటలక్ష్మి, W/o ఆర్.రామభూపాల్‌రెడ్డి, D/o యనమల క్రిష్ణరెడ్డి, వయస్సు 25 సం॥లు, వ్యవసాయం వలన జీవనం, R/o క్రిష్ణంపల్లి గ్రామం, దువ్వూరు మండలం, కడప జిల్లా.

...రెస్పాండెంట్

నోటీసు

పై నెంబరులోని పిటీషనరు, పై రెస్పాండెంట్ అయిన నీ పై విడాకులు కోరి పై కోర్టుయందు H.M.O.P. ని దాఖలు చేసిఉన్నాడు. అట్టి HMOP యందు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 26.11.2024వ తేదీన ఉదయం 10.30లకు హాజరు కావలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

**K.SREENIVASULU**
**T.PADMAJA**
**Advocates**